ఎస్‌బీఐ చైర్మన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఎస్‌బీఐ చైర్మన్‌గా నూతనంగా నియామకమైన చల్లా శ్రీనివాసులశెట్టికి తెలంగాణ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల సేవలను కొనియాడారు. గద్వాల జిల్లాకు చెందిన శ్రీనివాసులు ప్రతిష్ఠాత్మకమైన ఉన్నత పదవి బాధ్యతలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

మూతబడ్డ బడుల ఓపెన్ ఒట్టిమాటే

- నెరవేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ
- ఆ పాఠశాలలకు టీచర్లనే కేటాయించని సర్కారు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): విద్యార్థులు లేక మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ నీటి మూటగానే మిగిలింది. తాజాగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న వాటికి కేటాయించనేలేదు. విద్యార్థులున్న పాఠశాలలకే ఉపాధ్యాయులను కేటాయిస్తూ వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పది మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలకు ఒకరు, 11 నుంచి 40 మంది వరకు ఉన్న పాఠశాలలకు ఇద్దరు, 41 నుంచి 60 మంది ఉన్న పాఠశాలలకు ముగ్గురు, 61, ఆపైన విద్యార్థులున్న పాఠశాలలకు మంజూరైన అన్ని పోస్టులను భర్తీ చేసేలా వెబ్ ఆప్షన్లను కేటాయించింది. తాజా ప్రకటనతో ముఖ్యమంత్రి హామీ ఇప్పట్లో అమలయ్యేలా లేదని తేలింది. రాష్ట్రంలో మూతపడిన ప్రభుత్వ బడులను తెరిపిస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ బడులను తెరిపించేందుకు ఉపాధ్యాయులను కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో విద్యార్థులు లేక (జీరో ఎన్‌రోల్‌మెంట్) మూతపడిన 1,739 ప్రభుత్వ పాఠశాలలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెరుచుకుంటాయని ప్రజలు ఆశించారు. కానీ, ఆ పాఠశాలలకు తాజాగా ఒక్క ఉపాధ్యాయుడినీ ప్రభుత్వం కేటాయించలేదు.

సన్నాల జాబితా ఇచ్చేదెప్పుడు?

వరి నార్లు పోసే దశ ముగుస్తున్నా జాబితా ఇవ్వని వ్యవసాయ శాఖ

హైదరాబాద్, జూన్ 30(నమస్తే తెలంగాణ): సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ జాబితాను ప్రకటించలేదు. ఒకవైపు వానకాలం సీజన్‌కు వరి నార్లు పోసే దశ ముగుస్తున్నప్పటికీ, సన్న రకాల జాబితాను వ్యవసాయ శాఖ విడుదల చేయలేదు. ఒకవేళ తాము సాగు చేసిన సన్నాలు ప్రభుత్వ జాబితాలో లేకపోతే పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మే 20న జరిగిన మంత్రివర్గ సమావేశంలో సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సన్నాల జాబితాను రెండు రోజుల్లో వ్యవసాయ శాఖ విడుదల చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించి నెల దాటిపోయింది. కానీ, సన్నాల జాబితా జాడే లేదు. అయితే సన్నాల గుర్తింపుపై ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ పలుమార్లు భేటీ అయినప్పటికీ జాబితాపై స్పష్టత రాలేదు. నాలుగు రోజుల క్రితం జరిగిన భేటీలో కూడా సన్నాల జాబితాను ఖరారు చేయలేదు. గత నెలలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన విత్తన మేళాలో యూనివర్సిటీ అధికారికంగా 19 రకాల సన్న ధాన్యాలను సూచించింది. అయితే మార్కెట్‌లో వందల సంఖ్యలో సన్న రకాలు లభిస్తున్నాయి. దీంతో ఏయే రకాలు సన్నాల జాబితాలోకి వస్తాయనే అంశంపై వ్యవసాయ శాఖ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నది.

రేవంత్‌రెడ్డికి ముకుతాడు?

- ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట
- అధిష్ఠానం వద్ద నెగ్గిన సీనియర్ల మాట
- వలస నేతలకు మంత్రి పదవులు వద్దు
- నామినేటెడ్ పదవుల్లో ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు
- ఓడిపోయిన వారికి పదవులు ఇవ్వడం ఉండదు
- పీసీసీ, మంత్రివర్గ విస్తరణలోనూ సీనియర్ల ముద్ర

నిఖార్సైన కాంగ్రెస్‌వాదులకే పదవులు

నామినేటెడ్ పోస్టులు, మంత్రివర్గ విస్తరణపై సీనియర్ల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం ఆ తరువాత సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించింది. పార్టీ టికెట్‌పై గెలిచిన వారికే మంత్రి పదవులు, ఇస్తామని, ఎన్నికల్లో పోటీ చేయడానికి వివిధ కారణాల వల్ల అవకాశం దక్కని వారికే తప్ప ఓడిపోయిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వకూడదని తాము సూచించామని సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయం కాకుండా అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడంతో తమ ముద్ర తప్పకుండా ఉంటుందన్న ధీమాను సీనియర్లు వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల వరకు పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన పార్టీ అధిష్ఠానం.. ఇకపై ఆయన నిర్ణయాలకు కళ్లెం వేయనున్నట్టు తెలుస్తున్నది. రేవంత్ ఏకపక్ష నిర్ణయాలకు ఆమోదం తెలపకుండా పార్టీలోని ఇతర సీనియర్ నేతల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్టు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. నామినేటెడ్ పోస్టులు మొదలు పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, మంత్రివర్గ విస్తరణ వరకు ప్రతి అంశంలోనూ అధిష్ఠానం మునుపటిలా కాకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు వివరించారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎంత చెప్తే అంతే అని తల ఊపిన అధిష్ఠానం.. ఇటీవల ఆయన ప్రతిపాదించిన నామినేటెడ్ పోస్టులకు ఓ పట్టాన గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని గుర్తుచేస్తున్నారు. పీసీసీకి కొత్త అధ్యక్షుడి ఎంపికపై కూడా సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయం తెలుసుకున్న అధిష్ఠానం, పార్టీలో సీనియర్ నేతలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులను ఢిల్లీకి పిలిపించుకొని వారి అభిప్రాయాలను కూడా తెలుసుకుందని వివరించారు.

క్యాబినెట్ విస్తరణపై అందరితో సంప్రదింపులు

మంత్రివర్గ విస్తరణలో ఎవరికి చోటు కల్పించాలనే అంశంపై కూడా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సీనియర్లతో కూడా అధిష్ఠానం పెద్దలు చర్చించినట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదనలను ఒకరిద్దరు సీనియర్లు వ్యతిరేకించడంతో.. వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఢిల్లీకి పిలిపించి ఆయన అభిప్రాయాన్ని కూడా తెలుసుకున్నది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మంత్రివర్గంలోకి తీసుకోబోతున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా ప్రకటించడాన్ని సీనియర్లు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు తమ అభిప్రాయాలను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని, నామినేటెడ్ పోస్టుల ఎంపికలో జిల్లా మంత్రులకు తెలియకుండా జాబితా ప్రకటించారని వారు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ఎంపీ ఎన్నికల వరకు జరిగిన అన్ని పరిణామాలపై ఆరా తీసిన అధిష్ఠానం, ఇక ముందు అలా ఉండదని, సమిష్టిగా తీసుకునే నిర్ణయాలకే గ్రీన్ సిగ్నల్ ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

రేపు లేదా 4న మంత్రివర్గ విస్తరణ

- పీసీసీ అధ్యక్షుడి ప్రకటన కూడా ఆరోజే
- ముహూర్తం ఖరారైనట్టు ప్రచారం

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): పీసీసీకి కొత్త అధినేత నియామకం, మంత్రివర్గ విస్తరణ జూలై మొదటి వారంలోనే ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రెండు అంశాలపై పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ ఇతర ముఖ్యనేతలతో అధిష్ఠానం ఇప్పటికే చర్చించి నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో జూలై మొదటి వారంలోనే పీసీసీ కొత్త అధ్యక్షుడితోపాటు మంత్రివర్గ విస్తరణ ఉండవచ్చని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. జూలై 2 లేక 4వ తేదీన మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉన్నదని ఈ వర్గాలు కచ్చితంగా చెప్తున్నాయి. ఈ రెండు రోజుల్లో మంచి ముహూర్తం ఉండటంతో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కొత్త అధ్యక్షుని ప్రకటన ఉండవచ్చని అంటున్నారు. జూలై 2వ తేదీ ఏకాదశి మంచి ముహూర్తమే అయినప్పటికీ ఆ రోజు మంగళవారం కావడంతో దీని కంటే 4వ తేదీన త్రయోదశి, గురువారం ఇంకా బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమైనట్టు సమాచారం. జూలై 6 నుంచి ఆషాఢ మాసం ప్రారంభం కానుండటంతో ఆ లోగానే మంత్రివర్గ విస్తరణ జరగాలని పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది.

డీఎస్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

క్యాబినెట్‌లో వివక్ష?

మొదటిపేజీ తరువాయి...

ఉత్తర తెలంగాణకు ప్రభుత్వంలో పెద్ద పీట వేశారని వారు గుర్తు చేస్తున్నారు. మరి ఇప్పుడెందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తమకు ప్రాధాన్యం లభించడం లేదని వాపోతున్నారు.

కీలక శాఖలన్నీ దక్షిణ తెలంగాణకే!

ప్రస్తుత మంత్రిమండలిలో దక్షిణ తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఉత్తర తెలంగాణ నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాధారణ పరిపాలన, శాంతి-భద్రతలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌తోపాటు ఇతరులకు కేటాయించని శాఖలన్నింటినీ నిర్వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆర్థిక, విద్యుత్తు, ప్రణాళిక శాఖలను కేటాయించగా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఇరిగేషన్, ఆహార, పౌరసరఫరాల శాఖలను కేటాయించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖలను కేటాయించగా, దామోదర రాజనరసింహకు వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. తుమ్మల నాగేశ్వర్‌రావుకు వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖలను కేటాయించగా, జూపల్లి కృష్ణారావుకు ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖలు కేటాయించారు.

ఉత్తర తెలంగాణకు ప్రాధాన్యత లేని శాఖలే

ఉత్తర తెలంగాణకు చెందిన శ్రీధర్‌బాబు, సీతక్కకు గుడ్డిలో మెల్లగా కాస్త ప్రాధాన్యం కలిగిన శాఖలు కేటాయించగా, మిగతా ఇద్దరు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌కు ప్రాధాన్యంలేని శాఖలు దక్కాయి. దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పరిశ్రమలు, ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖలు, సీతక్కకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం శాఖలు కేటాయించగా, కొండా సురేఖకు దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖలు, పొన్నం ప్రభాకర్‌కు ట్రాన్స్‌పోర్టు, బీసీ సంక్షేమం శాఖలు కేటాయించారు.

ఆదిలాబాద్‌కు ఎందుకు ఇవ్వలేదు?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో చెన్నూర్ నుంచి వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి నుంచి గడ్డం వినోద్, ఖానాపూర్ నుంచి వెడ్మ బొజ్జు, మంచిర్యాల నుంచి ప్రేమ్‌సాగర్‌రావు నలుగురు ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో వివేక్ వెంకటస్వామి గతంలో ఎంపీగా, వినోద్ మంత్రిగా, ప్రేమ్‌సాగర్ రావు ఎమ్మెల్సీగా పనిచేసిన సీనియర్ నాయకులు. వీరిలో వెడ్మ బొజ్జు మాత్రమే మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యే. కానీ ఈ జిల్లా నుంచి ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. వివేక్, వినోద్ దివంగత జీ వెంకటస్వామి కుమారులు. వివేక్ కుమారుడు గడ్డం వంశీ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి ఎంపీగా గెలుపొందారు. ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి పదవులు ఉన్నాయన్న కారణంగా మంత్రివర్గంలో చోటు కల్పించలేదని చెప్తున్నారు. మరి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉంటూ పార్టీని కష్టకాలంలోనూ కాపాడుకుంటూ వచ్చిన సీనియర్ నాయకుడు ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రివర్గంలో ఎందుకు స్థానం కల్పించలేదన్న ప్రశ్నకు సమాధానం లేదు. కేవలం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రేమ్‌సాగర్‌రావు సన్నిహితుడన్న కారణంతోనే ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదని పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

నిజామాబాద్‌కు మొండి చెయ్యి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. ఈ జిల్లాలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇక్కడి నుంచి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో బోధన్ నుంచి మాజీ మంత్రి పీ సుదర్శన్‌రెడ్డి, జుక్కల్ నుంచి టీ లక్ష్మీకాంతారావు, ఎల్లారెడ్డి నుంచి మదన్‌మోహన్‌రావు, నిజామాబాద్ రూరల్ నుంచి ఆర్ భూపతిరెడ్డి ఉన్నారు. ఈ జిల్లా నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి గతంలో ఇరిగేషన్ వంటి కీలక శాఖ నిర్వహించినప్పటికీ మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం పట్ల ఆ జిల్లాలోనే కాకుండా కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం మంత్రివర్గ విస్తరణలో అయినా ఈ సీనియర్ నేతకు చోటు లభిస్తుందా? లేదా? అన్నది వేచి చూడాలి.

అశ్రునయనాల మధ్య డీఎస్‌కు వీడ్కోలు

- నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ఖలీల్‌వాడి, జూన్ 30: మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్‌కు ఇందూరు ప్రజలు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. నిజామాబాద్‌లోని ఆయన ఇంటి నుంచి బైపాస్ రోడ్డులోని వ్యవసాయ క్షేత్రం వరకు అశేష జనవాహిని మధ్య అంతిమ యాత్ర కొనసాగింది. అనంతరం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు నిజామాబాద్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. డీఎస్ భౌతికకాయానికి నివాళులర్పించారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ ఉన్నారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ తదితరులు డీఎస్ పార్థివదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

డీఎస్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన డీఎస్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని సీఎం రేవంత్ అన్నారు. విద్యార్థి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటులోనూ కీలకపాత్ర పోషించినట్టు తెలిపారు.

నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌తోనే నా ప్రయాణం

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

నారాయణపేట, జూన్ 30: 'గెలిచినా.. ఓడినా బీఆర్‌ఎస్‌తోనే నా ప్రయాణం. ఈ ఆత్మీయ సమ్మేళనం సాక్షిగా ప్రకటిస్తున్నా. ఎట్టి పరిస్థితిల్లోనూ పార్టీ మారను. కేసీఆర్ వెంటే ఉంటా' అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. ఆదివారం నారాయణపేటలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన, మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం సొంత జిల్లాలోనే విజయం సాధించానని, కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్ల రాజకీయాలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. 'పాలమూరు-రంగారెడ్డి' ఎత్తిపోతలపై మండలిలో తప్పకుండా ప్రస్తావిస్తానని చెప్పారు. ప్రభుత్వం జిల్లాలను రద్దు చేయాలని చూస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని, ప్రభుత్వం పెట్టే కేసులకు ఎవరూ భయపడవద్దని సూచించారు. ఎలాంటి హోదా లేకున్నా సీఎం తమ్ముడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తుంటే.. దౌల్తాబాద్ జడ్పీటీసీ మహిపాల్‌రెడ్డి నిలదీయడం అభినందనీయమని అన్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	36.0°c	22.7°c
మెదక్	35.0°c	22.8°c
మహబూబ్‌నగర్	32.3°c	24.2°c
కరీంనగర్	32.0°c	27.0°c
నల్లగొండ	32.0°c	24.0 °c
నిజామాబాద్	31.9°c	24.2°c
హైదరాబాద్	31.6°c	24.8°c
ఆదిలాబాద్	30.0°c	26.0°c
ఖమ్మం	29.0°c	27.0°c
వరంగల్	29.0°c	24.0°c

రేవంత్ ఇంటికి పీయూష్ గోయల్

ఆహ్వానించిన ముఖ్యమంత్రి • మర్యాదపూర్వకంగా భేటీ

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెళ్లారు. హైదరాబాద్‌కు వచ్చిన గోయల్‌ను సీఎం రేవంత్ తన నివాసానికి ఆహ్వానించి సాదరస్వాగతం పలికారు. ఇద్దరూ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై కేంద్రమంత్రితో సీఎం చర్చించారు. భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

స్మార్ట్‌సిటీ గడువు పొడిగింపు

వరంగల్, కరీంనగర్‌లో మార్చి 2025 వరకు పనుల కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): స్మార్ట్‌సిటీ మిషన్‌ను 2025 మార్చి వరకు పొడిగిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ముందుగా కేంద్రం నిర్ణయించిన గడువు ప్రకారం స్మార్ట్‌సిటీ మిషన్ కాల పరిమితి ఆదివారంతో ముగిసింది. రాష్ట్రంలో వరంగల్, కరీంనగర్ నగరాల్లో స్మార్ట్ మిషన్ పనులు చేపట్టగా, వరంగల్‌లో 45 పనులు పూర్తయ్యాయి. రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయి. కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయి. రూ.287 కోట్లతో చేపట్టిన మరో 22 పనులు కొనసాగుతున్నాయి. స్మార్ట్‌సిటీలో చేపట్టిన పనులు పూర్తికానందున ప్రజా ప్రయోజనార్థం ఇవి పూర్తయ్యేంత వరకు మిషన్ గడువును పొడిగించడానికి కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే నిధులు కేటాయించి ఆమోదించిన పనులను కొనసాగించాలని, కొత్త పనులు మంజూరు చేయొద్దని కేంద్రం స్పష్టం చేసింది. జరుగుతున్న పనులకు సంబంధించిన నిధులను ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఫస్ట్ కమ్ ఫస్ట్ పద్ధతిన విడుదల చేయనున్నది.

విభజన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ) : ఉభయ తెలుగు రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి పెంచుతూ విభజన హామీల అమలుకు పోరాడాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఏపీలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున పవన్ కల్యాణ్‌కు కొండగట్టులో స్వాగతం పలికామని చెప్పారు. గతంలో తిరుమలలో తెలంగాణ భక్తులు ఇబ్బందులు పడ్డారని, ఇకపై అలాంటి పరిస్థితులు రాకుండా చూడాలని టీటీడీని కోరారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 30: ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం జంగమాయిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగమాయిపల్లికి చెందిన రైతు పూజారి హనుమయ్య(62) ఆదివారం ఉదయం గ్రామశివారులోని తన పొలంలో నాటువేసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పొలానికి సరిపోయేంత నీరు ఉండటంతో బోరు మోటర్ ఆఫ్ చేసేందుకు వెళ్లాడు. స్టార్టర్ స్విచ్ ఆఫ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రేపు రుణమాఫీ గైడ్‌లైన్స్!

- 'రైతునేస్తం' కార్యక్రమంలో విడుదల
- షరతులపై ప్రభుత్వం కసరత్తు

హైదరాబాద్, జూన్ 30(నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ విధి విధానాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేయనున్నట్టు తెలిసింది. ప్రతి మంగళవారం రైతు వేదికల్లో నిర్వహించే 'రైతునేస్తం' కార్యక్రమంలో రైతుల సమక్షంలోనే రుణమాఫీ విధి విధానాలను జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. నాలుగు రోజుల్లో రుణమాఫీ విధి విధానాలను విడుదల చేస్తామని ఇటీవల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఇప్పటికే రుణమాఫీ విధి విధానాల రూపకల్పన తుది దశకు చేరుకున్నట్టు తెలిసింది. దీనిపై ఇటు వ్యవసాయ, అటు ఆర్థిక శాఖ అధికారులు కుస్తీ పడుతున్నారు. ఆగస్టు 15లోపు రైతులకు సంబంధించిన రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని, ఇందుకు రూ.31 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణపై ఆర్థిక శాఖ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. నిధులు సమకూరే మార్గాలను అన్వేషిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్సీడీసీ) నుంచి రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. దీంతోపాటు ఇతర మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్టు సమాచారం.

కోతలు తప్పవా?

రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యలో కోతలు తప్పేలా లేవు. ఇందుకు సంబంధించి విధి విధానాల్లో పలు షరతులను విధిస్తున్నట్టు తెలిసింది. పాస్‌బుక్ జత చేసి బంగారం కుదువపెట్టి తీసుకున్న రుణాలకు రుణమాఫీ వర్తించబోదని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ముందుగా ప్రభుత్వం లీకులు ఇచ్చినట్టుగా పీఎం కిసాన్ పథకంలోని కొన్ని నిబంధనలను రుణమాఫీకి వర్తింపచేయనున్నట్టు తెలిసింది. ప్రజా ప్రతినిధులు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, ఐటీ చెల్లించేవారిని రుణమాఫీకి అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. అయితే, నిజమైన రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, వారికి కచ్చితంగా రుణమాఫీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నట్టు సమాచారం.

'రైతు భరోసా' భూములపై సర్వే

- వ్యవసాయేతర భూముల తొలగింపుపై సర్కార్ ఫోకస్
- వెంచర్లు చేసి నాలా కన్వర్షన్ చేయని భూముల గుర్తింపు
- గ్రామాల్లోనూ చెలకలు, కొండ భూముల వివరాల సేకరణ
- ఆలస్యం కానున్న రైతుభరోసా పెట్టుబడి సాయం

హైదరాబాద్, జూన్ 30(నమస్తే తెలంగాణ): రైతు భరోసాలో కోతలకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. సాగులోలేని భూములకు పెట్టుబడి సాయం ఇవ్వబోమని ఇప్పటికే ప్రకటించిన ప్రభుత్వం.. రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే నిర్వహిస్తున్నది. ముఖ్యంగా మేజర్ గ్రామాలు, మండల, జిల్లా కేంద్రాలు, పట్టణ శివారు గ్రామాలపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టింది. వీటి చుట్టుపక్కల ప్రాంతాల భూములపై ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నది. రియల్‌ఎస్టేట్ వెంచర్లను పరిశీలిస్తున్నది. వాటికి అనుమతి ఉన్నదా? లేదా? ఆ భూములను కమర్షియల్ ప్లాట్‌గా విక్రయించారా? వ్యవసాయ భూమిగా విక్రయించారా? ప్రతి వెంచర్‌కు నాలా కన్వర్షన్ పూర్తయిందా? లేదా? తదితర వివరాలను సేకరిస్తున్నది. ఇప్పటికే రియల్‌ఎస్టేట్ వెంచర్లను ఏర్పాటు చేసి వాటిపై రైతుబంధు పెట్టుబడి సాయం తీసుకున్నారా? ఎప్పటినుంచి, ఎంత మొత్తం తీసుకున్నారు? అనే అంశాలపై లెక్కలు వేస్తున్నారు.

గ్రామాల్లోనూ సర్వే

పట్టణ ప్రాంతాల చుట్టుపక్కల భూములతోపాటు గ్రామాల్లోని భూములపై కూడా ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నది. గ్రామాల్లో సాగులోలేని భూములు, ముఖ్యంగా చెలకలు, కొండలు వంటి భూముల వివరాలు ఆరా తీస్తున్నది. ఆయా గ్రామాల్లో పంటలు సాగు చేయకుండా రైతుబంధు పెట్టుబడి సాయం పొందిన భూములు ఏ మేరకు ఉంటాయనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

రైతు భరోసా సాయం ఆలస్యం

వానకాలం సీజన్‌కు రైతు భరోసా పెట్టుబడి సాయం మరింత ఆలస్యం కానున్నది. సాధారణంగా వ్యవసాయ సీజన్ మొదలయ్యే జూన్‌లో పెట్టుబడి సాయం పంపిణీ ప్రారంభించాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు షరతులు విధించాలని నిర్ణయించింది. విధి విధానాలను రూపొందించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటుచేసింది. జూలై 15లోపు నివేదిక ఇవ్వాలని సబ్ కమిటీకి సూచించింది. మరోవైపు రైతుల నుంచి కూడా అభిప్రాయాలను సేకరిస్తున్నది. మొన్నటి మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతుల నుంచి అభిప్రాయాలు స్వీకరించింది. సబ్ కమిటీ ప్రతిపాదనలు, రైతుల అభిప్రాయాలను క్రోడీకరించి పూర్తిస్థాయిలో నివేదికను తయారుచేయనున్నది. రైతు భరోసా నిబంధనలపై అసెంబ్లీలో చర్చిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జూలై చివరి వారంలో జరిగే అవకాశం ఉన్నది. ఆ సమావేశాల్లో రైతు బంధుపై చర్చిస్తే.. అనంతరం అధికారులు అందుకు సబ్ కమిటీ, రైతులు అభిప్రాయాలను క్రోడీకరించి పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేయాల్సి ఉంటుంది. దీనికి కనీసంగా పదిహేను నుంచి నెల రోజులు పట్టే అవకాశం ఉన్నది. దీంతో నిబంధనలు రూపొందించి రైతుల జాబితాను సిద్ధం చేసేలోగా ఆగస్టు కూడా గడిచిపోతుంది. ఈ లెక్కన సెప్టెంబర్‌లో రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించే కార్యక్రమం మొదలుపెట్టే వీలుంటుంది. ఈ నేపథ్యంలో మొన్నటి యాసంగి మాదిరిగానే ఈ వానకాలం సీజన్‌లోనూ పంట కోతలు మొదలయ్యే వరకు కూడా రైతు భరోసా దక్కడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

పెట్టుబడి సాయం అందక రైతు ఆత్మహత్య



దస్రు (ఫైల్)

గూడూరు, జూన్ 30 : అదును దాటిపోతుండటంతోపాటు పంటపెట్టుబడి సాయం లేక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మచ్చర్లకు చెందిన గుగులోత్ దస్రు (52) తనకున్న 5 ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేసేందుకు ఈ ఏడాది పెట్టుబడి లేక, సీజన్ కూడా దాటి పోతుండటంతో చేసేదేమీలేక శనివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. దస్రుకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య ఆగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఏడాది వానకాలం పంటకు సంబంధించి ఇప్పటి వరకు రైతుభరోసా సహాయం అందకపోవడంతోపాటు గతంలో దస్రుకు ఉన్న ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.